ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పచ్చిమిర్చి @ రూ.100

మంట పుట్టిస్తున్న ధర



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పచ్చిమిర్చి ధర వింటేనే వినియోగదారులకు మంట పుడుతోంది. ఇటీవల ఎన్నడూ లేని విధంగా కిలో పచ్చిమిర్చి రూ.100కి చేరింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఎక్కడా వేసవిలో మిర్చి సాగు చేయలేదు. యర్రగొండపాలెం మండలంలో గోళ్లవిడిపి, పుల్లలచెరువు మండలం మల్లాపాలెం, నాయుడుపాలెం, చాపలమడుగు గ్రామాల్లో ముందస్తు అదునులో అరకొరగా పచ్చిమిర్చి కోసం సాగు చేసినప్పటికీ భూగర్భజలాలు పూర్తిగా ఎండిపోవడంతో బోర్లలో చుక్కనీరు రావడం లేదు. అందుకోసం అదనపు బోర్లు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వేసిన పంటంతా ఎండిపోయింది. ఈ క్రమంలో స్థానికంగా పచ్చిమిర్చి అందుబాటులో లేకపోవడంతో ధర అమాంతంగా పెరిగిపోయింది. గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో రూ.60 ధర పలికిన పచ్చిమిర్చి ఈ ఏడాది ధర కిలో రూ. 100కి చేరుకుంది.

మైదుకూరు నుంచి రవాణా..

కడప జిల్లా మైదుకూరు ప్రాంతంలో సాగైన పచ్చిమిర్చి ఈ ప్రాంతానికి వస్తోంది. అక్కడ కూడా దిగుబడి తగ్గిన నేపథ్యంలో అక్కడే కిలో రూ.80 నుంచి రూ. 90 లోపు ధర పలుకుతుంది. దీనికి తోడు 50 కేజీల పచ్చిమిర్చి బస్తా ఎత్తుడు, దించుడు కూలీతో పాటు యర్రగొండపాలెం ప్రాంతానికి రవాణా చార్జీలు కలుపుకొని రూ.250 నుంచి రూ.300 దాకా ఖర్చవుతుంది. దీంతో అక్కడ నుంచి తెచ్చుకున్న సరుకును కిలో రూ.100కు విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ యర్రగొండ పాలెం ప్రాంతానికి 50 క్వింటాళ్ల పచ్చిమిర్చి మైదుకూరు నుంచి రవాణా అవుతుంది. స్థానికంగా ఉన్న వ్యాపారులు దానిని యర్రగొండపాలెంతో పాటు పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోని చిరు వ్యాపారులకు కొంత లాభం చూసుకొని విక్రయిస్తున్నారు. ఈ ధర మరో నెల రోజుల పాటు ఉండేలా కనిపిస్తోంది. ఇదే జరిగితే పచ్చిమిర్చిని మర్చిపోవాల్సిన రోజులు తప్పేలా లేదు. ఇప్పటికే హోటళ్లలో చట్నీలోకి సైతం పచ్చిమిర్చికి బదులు ▶ 2లో

పోలీసులూ బిక్కుబిక్కు..!

- రాజకీయపార్టీలకు కొమ్ముకాసిన ఫలితమే.!
- పోలింగ్ అనంతరం మాక్‌డ్రిల్స్ పేరుతో హడావుడి
- ముందే అల్లరిమూకలపై కఠినచర్యలుంటే ఈ పరిస్థితి వచ్చేదా?



దర్శిలో మాక్ డ్రిల్‌లో భాగంగా ఫైరింగ్ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎస్పీ మొదలు స్టేషన్లలో ఎస్ఐ స్థాయి అధికారుల వరకూ రాజకీయ సిఫార్సులు లేకుండా పోస్టింగులు ఉండటం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు అంగీకరిస్తేనే ఎస్పీగా ఎవరైనా జిల్లాకు వస్తారు. వచ్చాక పాలకపక్షం చెప్పినట్లు వినాల్సిందే.. వాళ్లు చెప్పిందే వేదం. క్షేత్రస్థాయిలోనూ ఎమ్మెల్యేలను కాదని ఏ పని చేయడానికీ వీల్లేదు. సాధారణ సమయాల్లోనైతే పర్వాలేదు. ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆధీనంలో పనిచేయాల్సిన పోలీసు శాఖ అందుకు భిన్నంగా వ్యవహరించడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పార్టీలకు అతీతంగా ఉండాల్సిన పోలీసు అధికారులు ఏదో ఒక పార్టీకి కొమ్ముకాస్తున్నారు. ఇక్కడే పోలీసుశాఖపై నమ్మకం పోతోంది.

ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా పోలీసుశాఖలో చోటుచేసుకున్న కొన్ని ఊహించని పరిణామాలే ఇందుకు అద్దం పడుతున్నాయి. పోలీసుశాఖ ఉనికే ప్రశ్నించే పరిస్థితి తెచ్చుకున్నారు. ఇంకా చెప్పాలంటే పోలీసులను చూసి నేరస్తులు కాలర్ ఎగరేస్తున్నారు. పోలీసుశాఖే బిక్కుబిక్కుమనే పరిస్థితికి వచ్చింది. ఈ స్థితికి రావడానికి పోలీసుల చర్యలే కారణంగా చెప్పక తప్పదు. ముందే నేరస్వభావం, గొడవలకు కారకులను గుర్తించి అదుపులో ఉంచాలి. వారిపై నిఘా పెట్టాలి. అలాకాకుండా పాలకపక్షనేతలకు ఆగ్రహం వస్తుందనే భయంతో వదిలేయడం వల్లనే ఎన్నికల్లో గొడవలకు ఆజ్యం పోసినట్లతోంది. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక ఎస్పీ పరమేశ్వరరెడ్డి బదిలీ అయ్యారు. ఆయనపై పలు ఆరోపణలువచ్చాయి. ప్రధాని మోడీ బహిరంగసభ సందర్భంగా విధులు సక్రమంగా నిర్వహించలేదన్న విమర్శలను ప్రతిపక్షం చేసింది. ఏదోరకంగా ఆయన్ను పంపాలన్నదే తెరచాటున ఉద్దేశం. ఎందుకంటే ఆయన్ను ఏరికోరి ఇక్కడకు ఎస్పీగా తెచ్చారు. ఎన్నికల కోసమే పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రత్యేకంగా వేయించుకున్నారనే చర్చ లేకపోలేదు. ఆయన వచ్చీరాగానే పాలకపక్షానికి అనుకూలంగా ఉన్నారనే ఉద్దేశంతో ఆయన్ను సాగనంపేందుకు తెలుగుదేశం నేతలు వ్యూహం రచించారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. వెంటనే కథ నడిచింది. ఎస్పీని బదిలీ చేశారు. ఎన్నికల ప్రక్రియ నడుస్తున్న సమయంలోనే గరుడ్ సుమిత్ సునీల్‌ను ▶ 2లో

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

- జిల్లాలో ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు..
- ఎస్పీ వకుల్‌జిందాల్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో, చుట్టు పక్కల ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎలక్షన్ కౌంటింగ్‌కు సంబంధించి జిల్లాలో ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు. ఇందుకు భిన్నంగా ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఎన్నికల కౌంటింగ్ నిమిత్తం తీసుకుంటున్న భద్రత ఏర్పాట్లు, జిల్లా ప్రజలు, వివిధ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు అనుసరించవలసిన ఎన్నికల నియమావళి గురించి వివరించారు. జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ నిమిత్తం స్ట్రాంగ్ రూంల వద్ద, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో, చుట్టుపక్కల ప్రాంతాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమస్యాత్మక గ్రామాలలో, ముఖ్యమైన ప్రదేశాలలో, ప్రధాన కూడళ్లలో పోలీస్ బలగాలతో పికెట్‌లను ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్, సెక్షన్ 144 సీఆర్పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున, ఏ ప్రాంతంలో కూడా నలుగురు కన్నా ఎక్కువ మంది ఒక చోట గుమికూడి ఉండరాదని, బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్‌బంక్‌లలో పెట్రోల్, డీజిల్‌లను వాహనాలలో మాత్రమే నింపాలని, విడిగా బాటిల్స్‌లో పొయ్యరాదని, ఏ పెట్రోల్ బంక్ వారు అయిన నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చడానికి అనుమతి లేదని, బాపట్ల జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రాలను, నిల్వచేసే గోడౌన్‌లను పోలీసు, ఫైర్ అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు, నిల్వచేసే గోడౌన్ ల యజమానులు బాణసంచా విక్రయించరాదని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులను పెట్టి ప్రచారం చేయటం నేరమన్నారు. అలా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన ▶ 2లో

ఈదురుగాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంతో పాటు పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం తాకిడికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల పొడవునా ఉన్న డ్రెయినేజీ కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. వర్షపు నీరు తాకిడికి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, చైతన్య నగర్, దిలావర్ వారి వీథి, చింతపల్లి వారి వీధి, రజక వీధి రహదారులన్నీ వర్షం నీటితో చెరువులను తలపించాయి. ఈదురు గాలుల తాకిడికి పలు చోట్ల చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. పొలాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. యర్రగొండపాలెంతో పాటు పలు గ్రామాల్లో విద్యత్ ప్రసారం నిలిచిపోయింది. గత ఏడాది నుంచి కాలువల్లో పూడికతీత లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి సైతం మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో స్థానికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. కురిసిన వర్షానికి పొలాలు పదునయ్యే అవకాశం ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పశువుల కుంటల్లో నీరు చేరుకుందని, భూగర్భ జలమట్టం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగం అంటున్నారు. ఇలాంటి వర్షాలు మరో రెండు రోజులు కురిస్తే వాతావరణం చల్లబడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.



సమ్మర్‌క్యాంప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

25 నుంచి సమ్మర్ క్యాంప్

▶ 8లో

పచ్చిమిర్చి @ రూ.100

(మొదటిపేజీ తరువాయి)

ఎండుకారాన్ని వాడుతున్నారు. గృహిణులు కూడా ఇదేవిధంగా చేస్తున్నారు.

పచ్చిమిర్చికి బదులు ఎండుకారం
భూసారపు లక్ష్మి, గృహిణి, యర్రగొండపాలెం

వంటల్లో పచ్చిమిర్చికి బదులు ఎండుకారాన్ని వాడుతున్నాం. ఇదే ధరలు నిలకడగా ఉంటే పచ్చిమిర్చిని మర్చిపోవడమే. ఇటీవల ఇంత ధర తామెప్పుడూ చూడలేదు. రోజురోజుకూ ధర పెరుగుతుండటంతో కుటుంబ పోషణ కూడా భారంగా మారుతోంది.

లాభాలు అంతంత మాత్రమే..
కొమర కోటేశ్వరరావు, కూరగాయల వ్యాపారి, యర్రగొండపాలెం

గతంలో పచ్చిమిర్చి ధర తక్కువగా ఉన్న సమయంలోనే ఎంతో కొంత లాభం వచ్చేది. ప్రస్తుతం ధర పెరగడంతో లాభాలు రావడం కూడా అంతం మాత్రంగానే మారింది. దూరప్రాంతం నుంచి తెప్పించుకునే పచ్చిమిర్చి ఒక్కోసారి బస్తాల్లోనే వాడుపడిపోవడం, పండుబారడం జరుగుతుంది. అటువంటి సమయంలో తెచ్చిన ధర కంటే ఇంకా తక్కువ ధరకే హోటళ్లకు విక్రయించాల్సి వస్తోంది. ధర తక్కువగా ఉన్న సమయంలోనే మాకు కొంత వరకు ఆదాయం ఉండేది.

పోలీసులూ బిక్కుబిక్కు..

(మొదటిపేజీ తరువాయి)

ఎస్పీగా నియమించారు. రాజకీయ ఆరోపణలతో పరమేశ్వరరెడ్డి బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన ఎస్పీ సుమిత్‌సునీల్ జాగత్తగా పనిచేయాల్సి వచ్చింది. ఎన్నికల్లో ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడ పర్వాలేదనిపించింది. ఒంగోలు నగరంలో మరో ఇద్దరు సిఐలపైనా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల విధుల నుంచి తప్పించారు. ఇక్కడా ఓ రాజకీయపార్టీకి అనుకూలంగా ఉన్నారన్నదే ఆరోపణ. వాస్తవానికి పోలీసుశాఖ ఎక్కువశాతం పాలకపక్షానికి అనుకూలంగానే వ్యవహరించిందనే చర్చ లేకపోలేదు. ఎన్నికలకు ముందు జరిగిన అనేక వ్యవహారాల్లోనూ పోలీసు అధికారులు అనవసరంగా తలదూర్చారు. పర్చూరు నియోజకవర్గంలో ఓట్లు తొలగింపుల్లో జోక్యం చేసుకున్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ వ్యవహారాలపై న్యాయపోరాటం చేశారు. వారిపై కోర్టు ఆదేశాలతో చర్యలు తీసుకున్నారు. అక్కడా అప్పట్లో పాలకపక్ష ఇన్‌ఛార్జికి అనుకూలంగా పోలీసులు నడిచారు. ఇలాంటి చర్యల వల్ల పోలీసుశాఖ అభాసుపాలవుతోంది. పోలింగు రోజునా కొన్నిచోట్ల ఘర్షణలు జరిగాయి. పుల్లలచెరువు మండలంలో రాళ్లు రువ్వుకున్నారు. దర్శి మండలం బొట్లపాలెంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒంగోలు మండలం, వెంకముక్కపాలెంలోనూ పోలింగు ముగిశాక ఘర్షణలు జరిగాయి. పలుచోట్ల చిన్నచిన్న ఘర్షణలు తలెత్తాయి. వీటన్నింటికీ కారణం పోలీసుశాఖ మరింత అప్రమత్తంగా లేకపోవడమే.. ముందుగానే అల్లర్లకు కారకులపై చర్యలు చేపట్టకపోవడమే.. పాత నేరస్తులను వదిలేశారు. బైండోవర్లు పెద్దగా లేవు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎక్కువ సిబ్బంది కూడా లేరు. నాలుగు పోలింగ్ బూతులకు ఇద్దరు, ముగ్గురు కానిస్టేబుళ్లను పెట్టారు. క్యూలను కంట్రోల్ చేయలేక అవస్థలు పడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాన్ని సమస్యాత్మకంగా గుర్తించారు. రాజకీయ నేతల వెంట అల్లరిమూకలు చేరిపోయాయి. నిత్యం ఏదో తరహా గొడవలకు దిగుతున్నారు. ఎన్నికల ప్రచారంలోనే ఘర్షణలు చోటుచేసుకున్నాయి. వీటిని కూడా నియంత్రించలేకపోయారు. పైగా ఎన్నికల సంఘం అదనపు బలగాలను మోహరించాలని సూచించింది. అయితే ఎక్కడా బలగాలు కనిపించలేదు.

బాపట్ల జిల్లాలోనూ పలు హింసాత్మక ఘటనలు జరిగాయి. వీటన్నింటికీ కారణం పోలీసుశాఖ ఉండాల్సిన పద్ధతిలో లేకపోవడమే.. ఎవరు అధికారంలో ఉన్నా వారికి కొమ్ముకాయడం అనివార్యమైంది. గత ఎన్నికల్లోనూ జిల్లా ఎస్పీ హఠాత్తుగా బదిలీ అయ్యారు. ఈ ఎన్నికల్లో పునరావృతమైంది. ఇప్పుడు మాక్‌డ్రిల్ పేరుతో పోలీసులు పట్టణాల్లో హడావుడి చేస్తున్నారు. ఇదంతా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగానే ఉంది. ఇప్పటికైనా పోలీసుశాఖ విధుల నిర్వహణలో ప్రజలకు చేరువగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించాలి.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యుత్ అధికారులు, విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లు సమన్వయంతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డివిజన్ విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని 33/11 కెవి సబ్ స్టేషన్ల షిఫ్ట్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ లిమిటెడ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కట్ట వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లు తమ యొక్క విధులను నిర్వర్తించేటప్పుడు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, విసిబిలు ఆపరేట్ చేయడం, లైన్ క్లియరెన్స్‌లు తీసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. విద్యుత్ స్టేషన్‌లో ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియపరచి వారి సలహాలు, సూచనలు తప్పక పాటించాలని అన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించడమే సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ లిమిటెడ్ యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. జిల్లా ప్రొటెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ రఘుబాబు, ఏడిఏ గురవయ్య, ఐటి ఏడిఈ పద్మావతి, మార్కాపురం ఏడిఈ ఆపరేషన్, ఎస్ సియానాయక్, సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ఏఈలు, ఆయా సబ్ స్టేషన్‌లకు చెందిన షిఫ్ట్ ఆపరేటర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణ ప్రారంభం



క్రీడా శిబిరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీ కోడి రామమూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఉచితంగా క్రీడ, నృత్య, నట శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. బాక్సింగ్ శిక్షణ శిబిరాన్ని బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణు, కర్రసాము శిక్షణ కేంద్రాన్ని భీమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఫుట్‌బాల్ శిక్షణను డాక్టర్ తొండమల్లి సంజీవ్, నృత్య శిక్షణ శిబిరాన్ని ఆ సంస్థ అధ్యక్షులు పిన్నిక నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. క్రీడా శిక్షణ శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు అయ్యేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి కాళంగి శ్రీనివాసులు స్వాగతం పలుకగా భరత నాట్య కళాకారిణి ప్రియాంక, ఫుట్‌బాల్ కోచ్ ఉప్పు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

వేసవి శిబిరంలో నీతి కథలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో నీతి కథలను అర్చకులు శివరామకృష్ణ పిల్లలకు చెప్పారు. శిక్షణా కార్యక్రమమైన 7వ రోజు పిల్లలు కథలు చదవడం, కథలు చెప్పించడం చేశారు. పుస్తక పఠనం, కథలను చదివించటం, కథలు చెప్పించడం లాంటివి నిర్వహించారు. అనంతరం పిల్లలతో డ్రాయింగ్ వేయడం, చదరంగం నేర్చుకోవడం లాంటివి చేయించారు. ఈ శిబిరంలో 16 మంది పిల్లలు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు కే సత్యనారాయణ పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

(మొదటిపేజీ తరువాయి)

కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యువత బైకులకు సైలెన్సర్లు తీసి, ఇతరులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఎక్కువ శబ్దం చేస్తూ బైకులను నడిపించటం నేరమని, ఎక్కువ శబ్దం వచ్చే వాహనాలను నడిపే వారిపై కేసులు నమోదు చేసి, బైకులు స్వాధీనం చేసుకొని, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఎవరైనా అనుమానంగా తిరిగినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పోలీస్ వారికి వెంటనే సమాచారం అందించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణం జీవనం సాగించటంలో, ప్రతి పౌరుడు భాద్యతగా వ్యవహరించాలని, ప్రజలందరూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ వారికి సహకరించి, వారి ముందస్తు సూచనలు, సలహాలు పాటించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

రాజీవ్ గాంధీకి నివాళి



మానసిక రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు ఆదేశాల మేరకు మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యువజ న కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నల దాసు ప్రవీణ్ కుమార్, ప్రకాశం జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దుగ్గెంపూడి బాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలోని సన్‌జో సేవాలయంలోని మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నలదాసు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా దేశానికి ఐటి రంగాన్ని పరిచయం చేసి యువతకి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో పెద్దన్న పాత్రను పోషించాడు అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. సమాజంలో అనాథలుగా అభాగ్యులుగా మిగిలి పోయిన వారికి మనం తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మానసిక వికలాంగుల ఆశ్రమంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చు సూరి, వెంకటేశ్వర్లు నాయక్, బాలకృష్ణారెడ్డి, ప్రవీణ్, సొసైటీ ప్రెసిడెంట్ డి మంత్రూ నాయక్, ఆర్ అంజి నాయక్ పాల్గొన్నారు.

సాగర్ నీరు సరఫరా

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దూపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిధిలోని పలు గ్రామాలకు గత వారం రోజులుగా పైపులైన్లు మరమ్మతులకు నోచుకోక పోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజాశక్తి జిల్లా టాబ్లాయిడ్‌లో ఈ నెల 21వ తేదీన 'వారం రోజులుగా నిలిచిన సాగర్ నీరు' అనే కథనం ప్రచురితమైంది. వార్తకు స్పందించిన అధికారులు యుద్ధ ప్రాతిపదికన దూపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పైపులైన్లు మరమ్మతులు చేయించారు. దాని పరిధిలోని గ్రామాలకు మంగళవారం సాగర్ నీరు సరఫరా చేశారు. సాగర్ నీరు సరఫరా కావడంతో వివిధ గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీసులు

అపరిచితుల సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి-గిద్దలూరు: తమ ఇళ్ల వద్ద ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గిద్దలూరు అర్బన్ సిఐ సోమయ్య తెలిపారు. పట్టణంలోని నల్ల బండ బజార్, పూసల బజార్‌లో మంగళవారం ఉదయం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో సరైన ధ్రువ పత్రాలు లేని పది మోటర్ సైకిళ్లను సీజ్ చేశారు. ఈ సెర్చ్‌లో సీఐ సోమయ్యతో పాటు గిద్దలూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ విద్యాదీవెన

సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్

ప్రజాశక్తి -కనిగిరి

అర్హులైన ప్రతి ఒక్కరికీ విద్యాదీవెన, వసతి దీవెన లబ్ధి చేకూరేలా చూడాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్ తెలిపారు. జిల్లాలో డిగ్రీ ఆపై అన్ని కళాశాలలలో చదువుచున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి,ఇబిసి మరియు మైనారిటీ విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి విద్యా దీవెన మరియు వసతి దీవెన పథకానికి సంబంధించిన 8 అంశాలపై స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గహంలో కనిగిరి సహాయ సాంఘిక సంక్షేమాధికారి పి. శివ నాయక్ అధ్యక్షతన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మా నాయక్ మాట్లాడుతూ విద్యా దీవెన మరియు వసతి దీవెనకు సంబంధించి ఇప్పటివరకూ అప్‌డేట్ కాని కాని విద్యార్థుల ఖాతాలను అప్‌డేట్ చేయాలన్నారు. 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి విడుదలైన విద్యా దీవెన నగదును సంబంధిత కళాశాలలకు జమచేయని విద్యార్థుల తల్లులకు ఖాతాలకు సంబంధించి నవశకం లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసిన నోటీసులు అందజేసి లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. గడిచిన త్రైమాసికం వరకూ విడుదలైన నిధులను కళాశాలలకు చెల్లించని విద్యార్థుల తల్లులు చెల్లించేలా కౌన్సిలింగ్ నిర్వహించి నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 5 స్టెప్స్ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి కారణాలను నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు.2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గవ త్రైమాసికం కళాశాలలకు ఫీజు చెల్లించని తల్లుల వివరాలను సెక్రటేరియట్ నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గవ త్రైమాసికం ఫీజులు కళాశాలలకు చెల్లించని తల్లులకు నోటీసులు అందజేసి వారి వివారలను సెక్రటేరియట్ నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గవ త్రైమాసికం ఫీజు కళాశాలలకు చెల్లించని తల్లులకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి వివరాలను సెక్రటేరియట్ నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఎస్‌పిసిఐ పెండింగ్ ఉన్న ఎస్‌పి విద్యార్థుల ఆధార్ నంబర్లను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి సహాయ సాంఘిక సంక్షేమాధికారి షేక్ రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మానాయక్

దేవస్థానం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగరాయకొండ

పాత శింగరాయకొండ శ్రీవరహాలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివీద్ధికి కృషి చేస్తాననని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. దేవస్థానం కమిటీ చైర్మన్ పామర్తి మాధవరావు మనమరాలి అన్నప్రాసన మంగళవారం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు ఈ వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అదేవిధంగా ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పామర్తి మాధవరావు నివాసానికి వెళ్లి చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత శింగరాయకొండ దేవస్థానం అభివద్ధికి పూర్తిస్థాయిలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, ఉపసర్పంచి నక్క బ్రహ్మేశ్వరరావు, ఇమ్మడిశెట్టి రామారావు, దాసరి యానాదిరావు, బచ్చు యుగంధర్, మోరుబోయిన యోగానంద్, కనిగిరి వెంకటేశ్వర్లు, గోకరాజు పాపయ్యనాయుడు, చవిడిబోయిన మురళి, మేకల అంకమ్మరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొండపి

ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి. మస్తాన్ తెలిపారు. మండల పరిధిలోని మూగచింతల గ్రామం నక్క వాగులకుంటలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తాన్ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీల సౌకర్యార్థం ప్రని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ కిట్ అందు బాటులో ఉంచాలన్నారు. పలుగు, పారా, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, రాము అగ్గిరాజు, సునీత, వెంకాయమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

మండల కేంద్రమైన హనుమంతునిపాడులో కనిగిరి సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటిలో సోదాలు నిర్వహి ంచారు. సరైన ధ్రువ పత్రాలు లేని 29 బైకులను సీజ్ చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్ర మాలు, హింసకు పాల్పడరాదని తెలిపారు. ఎవరైనా దుశ్చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎస్ఐ త్యాగరాజ్, హనుమంతునిపాడు ఎస్ఐ శివ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

మద్దిపాడు : మండల కేంద్రమైన మద్దిపాడు బీసీ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు రూరల్‌సిఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గొడవలు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 20 వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన ఈ కార్యక్రమంలో మద్దిపాడు ఎస్ఐ మహేష్, సంతనూతలపాడు ఎస్ఐ దేవకుమార్, నాగులుప్పలపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ..

బస్సు ప్రమాదం : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి- కనిగిరి


నిరసన తెలుపుతున్న నాయకులు

ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే కనిగిరి డిపోకు చెందిన బస్ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురైనట్లు ఎంఆర్‌పిఎస్ నాయకులు రావినూతల కోటయ్య , జేపీ.రాజు ,జుట్టిక డానియల్ తెలిపారు. కనిగిరి ఆర్‌టిసి డిపో మేనేజర్‌ను బస్సు ప్రమాదంలో మతి చెందిన వారి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ ఆర్‌టిసి యాజమాన్యం ముందురోజు చెన్నై నుంచి కనిగిరికి వచ్చిన డ్రైవర్‌నే తిరిగి అదే రోజు రాత్రి చెన్నైకు పంపినట్లు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులో బస్సు నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు వారు ఆరోపించారు. డ్రైవర్‌కు తగినంత విశ్రాంతి లేకపోవడం వల్ల బస్సు ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. ఆర్‌టిసి యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నవరం గ్రామానికి చెందిన వేమవరపు మరియమ్మ చనిపోవడంతో ఆరుగురు పిల్లలు అనాథలు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వేమవరపు డేవిడ్ ఘటన స్థలంలోనే చనిపోగా వేమవరపు సౌభాగ్యం ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆర్‌టిసి సంస్థ న్యాయం చేసే వరకూ ఎంఆర్‌పిఎస్ అండగా ఉంటుందని హెచ్చరించారు. సత్వరమే ఆర్‌టిసి యాజమాన్యం స్పందించి బాధిత కుటుంబాలకు ఆదుకోవాలన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు. బాధిత కుటుంబాలల్లో ఇంటికి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చీమకుర్తి : చీమకుర్తిలోని ఎస్‌కెఆర్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు తెలిపారు.6 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన చెవిటి,మూగ, పుట్టుక నుంచి మాటలు రానివారు ఒకటి నుంచి 10వ తరగతుల లోపు తరగతుల్లో చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. పాఠశాలలో ప్రత్యేక విద్యతోపాటు ఆధునిక పరికరాలతో స్పీచ్‌థెరిపి, మిషన్ ద్వారా మాటలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఆడిటర్ శిక్షణ ద్వారా వివిధ రకాల శబ్దాలను గుర్తుపట్టేలా శిక్షణ ఇస్తారన్నారు. హియరింగ్ మిషన్ శ్రవణ యంత్రాల ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్స్ ద్వారా డిజిటల్ విద్య అందించనున్నట్లు తెలిపారు. ఫొటో లామినేషన్, కవర్లు, కొవ్వొత్తుల తయారీ, ఫినాయిల్, బుక్ బైండింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. బాల, బాలికలలకు ఉచిత విద్యతోపాటు, ప్రత్యేక హాస్టల్ వసతి కలదన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను జూన్ 12లోపు అందజేయాలన్నారు పూర్తి వివరాలకు 9440336730, 9505060361, 08592272730 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు..

ఉపాధి పనుల తనిఖీ

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని కొత్తకోట, తక్కెళ్ళపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఏపీడీ పాలేటి వెంకటస్వామి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు తక్కెళ్ళపాడులో మూడు పనుల జరుగుచుండగా ఒక చోట మాత్రమే పనిప్రదేశంలో కూలీలు ఉన్నారు. మిగిలిన రెండు చోట్ల ఉదయం 8.గంటలు దాటినా కూడా కూలీలు పనికి రాలేదని గుర్తించారు. పనుల నిర్వహణ కూడా నాసిరకంగా, నాణ్యత లేని విషయం గర్తించారు. అందుకు బాద్యులైన టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై క్రమశిక్షణ చర్యలు నిమిత్తం ఉన్నత అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.అనంతరం కొత్తకోట గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎపిఒ రవి బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కొండపి : రాయితీపై పంపిణీ చేసేందుకు పచ్చి రొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు ఎఒ జి.విజయ్ కుమార్ తెలిపారు. 50 శాతం రాయితీ పై పంపిణీ చేసేందుకు 64 క్వింటాళ్ల జనుములు, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు రైతు భరోసా కేంద్రాలు వద్ద సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జనుము, జీలుగ విత్తనాల పూర్తి రూ.88 కాగా సబ్సిడీ పోను రూ.44 అందజేయనున్నట్లు తెలిపారు. పిల్లిపెసర విత్తనాల పూర్తి ధర రూ.134 కాగా సబ్సిడీ పోనూ రూ.67 రూపాయలకు అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయ శాఖ సిబ్బంది సమావేశం

కొనకనమిట్ల : మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎఒ రంగలక్ష్మీ అధ్యక్షతన సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రంగలక్ష్మీ మాట్లాడుతూ 2023- 24 రబీ సీజన్‌లో మండలంలో తక్కువ వర్షపాతం నమోదు అయినందున మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది రబీలో ఈ క్రాప్ చేసిన పంటల వివరాలను 34 కాలమ్స్ ప్రొఫార్మాలో పొందుపరచి ఈనెల 24లోపు అందజేయాలన్నారు. మినుము, అలసంద(బొబ్బర్లు), పెసర, ఆముదాలు, ఉలవలు, శనగ పంటలకు 33 శాతం కంటే ఎక్కువగా రైతులు నష్టపోయారన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లోని ఈ క్రాప్ చేయించుకున్న వారి వివరాలు తప్పనిసరిగా ప్రొఫార్మాలో చేర్చి అందజేయాలన్నారు. సామాజిక తనిఖీ అనంతరం ఈ నెల 29న జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి జాబితా పంపించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రూ.50వేల నగదు అందిస్తున్న బట్ట మోహనరావు

క్రీడాకారునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడైన పిచ్చుక నాగరాజు అంతర్జాతీయ పారా ఒలంపిక్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 28నుంచి జూన్ 3వరకు చైనాలో జరిగే పోటీల్లో పాల్గొననున్నడు. ఆర్థిక ఇబ్బందు కారణంగా ఇబ్బంది పడుతున్న నాగరాజుకు రోటరీ క్లబ్ ప్రతినిధులు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు బట్ట మోహనరావు తెలిపారు. మన రాష్ట్రం తరపున నాగరాజు ఒక్కరే ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతి బావంతుడైన నాగరాజు 2007, 2011లో జర్మనీ, కంబోడియాలో జరిగిన పోటీల్లో పాల్గొని మన దేశానికి పతకాలు సాధించాడని గుర్తు చేశారు. నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన ఆయన ఎంతో కష్టపడి ఎదిగాడని అన్నారు. రోటరీ క్లబ్ ద్వారా రూ.50వేల సహాయం అందించడం తన జీవితంలో మరువలేనని నాగరాజు అన్నారు. ఎన్నారైలు పేరిసెట్ల లలితబాబు, బొడ్డు వీరమల్లు, క్రీడాభిమానులు కట్ట రాజ్ వినయ్ కుమార్, సిద్ధి బుచ్చేశ్వరరావు, వడగ ప్రసాద్, యజ్ఞ నాగేంద్రప్రసాద్, పింజల శ్రీనివాసరావు, రొటేరియన్లు గొల్లపూడి సీతారాం, కొత్త వాసు, నాగేంద్రరావు, ఉపేంద్ర, వాసుదేవసింగ్ తదితరులు సహాయం అందించారని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎఇ యారాసు గణపతి, రోటరీ కార్యదర్శి ఎవి సురేష్ బాబు పాల్గొన్నారు.



మత్స్యకారుని మృతదేహానికి నివాళి అర్పించిన ఆమంచి

మత్స్యకారునికి నివాళి

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు రోడ్డులో స్కూటీ నడుపుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఊటుకూరి సుబ్బయ్యపాలెంకు చెందిన బాలాజీ (55) మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ నివాళి అర్పించారు. స్థానిక ఏరియా వైద్యశాల్లో మత్స్యకారుడు బాలాజీ మృతి దేహాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబానికి సానుభూతిని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.



నూతన భవనంలో తొలి సంతకం చేస్తున్న ఇఒ టి సుభద్ర

శింగరకొండ ఆలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నూతనంగా పరిపాలన కార్యాలయ భవనం నిర్మించారు. భవనాన్ని మంగళవారం ప్రారంభించి ఈఓ టి సుభద్ర తొలి సంతకం చేశారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు హరి శంకర్ అవధాని, ఆలయ పూజారులు లక్ష్మీనారాయణ, సత్యం, కిషోర్, పెద్దబాబు, చిన్న బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగు వెలసిన పెయింటర్ల బతుకులు

- ఆర్థిక భారంతో పెయింటర్ల సతమతం
- ప్రమాదకర పరిస్థితుల్లో చేస్తున్న పనులు
- పట్టు తప్పితే ప్రాణానికే ప్రమాదం
- అమలు కాని ప్రభుత్వ భీమా పథకాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

లక్షలు పోసి నిర్మించిన ఇళ్ళు, ఇతర నిర్మాణాలు అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలంటే రంగు పడాల్సిందే. అలాంటి రంగులు అద్దే కార్మికుల బ్రతుకులు కళ తప్పి కనిపిస్తున్నాయి. భవనాలకు రంగు వేయాలంటే తాడు సహాయంతో గాల్లో వేలాడుతూ ఉంటారు. లేదా నిచ్చెన మీద నిలబడి ప్రమాదకర స్థితిలో రంగులు అద్దుతుంటారు. పరాంజాలపైకి ఎక్కి ప్రాణాలకు తెగించి మరీ రంగులతో భవనాలకు కొత్త అందాలను తెస్తారు. అలాంటి పెయింటింగ్ కార్మకుల బ్రత్తుకుల్లో రంగుల వెలుగులు కనిపించడంలేదు. పెయింటింగ్ కార్మికుల పట్ల ప్రభుత్వాలకు పట్టడంలేదు. వ్యక్తి గత జీవితం తెచ్చి పెడుతున్న అనారోగ్యాలు, తదితర సమస్యలతో సతమతం అవుతున్నారు. ప్రభుత్వ సహాయం అందదు. నియోజక వర్గ పరిధిలోని మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో 65వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వీరిలో పెయిం టర్లను కూడా అధికారులు నమోదు చేశారు. పని పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలని పెయింటర్లు కోరుతున్నారు.

ప్రమాదపు అంచుల్లో పెయింట్ పని

తాడు, కర్రలు, నిచ్చెనలతో ఏర్పాటు చేసిన పరంజా వంటి పరికరాలను ఆధారంగా చేసుకొని రంగులు వేస్తుంటారు. తాడు ఎక్కడైనా బలహీనంగా ఉండి తెగినా, నిచ్చేన కర్రలు విరిగినా ప్రమాదానికి గురవుతుంటారు. ఇలాంటి ప్రమాదాల కారణంగా వికలాంగులైన వారు కూడా ఉన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో భవన నిర్మాణ పనులు చేస్తూ భవనంపై నుండి క్రింద పడటంతో ఓ కార్మికుడు శాశ్వతంగా వికలాంగుడయ్యాడు. అయినా ప్రభుత్వం నుంచి నేటికీ ఎటువంటి సంక్షేమ పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పొంచి ఉన్న అనారోగ్యం

నిత్యం పెట్రో కెమికల్స్‌తో కూడిన రంగులు అద్దుతూ వంటి పూసుకుంటూ వాసన పీల్చుతూ అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఎక్కువ సమయం గోడలకు వేలాడుతూ ఉంటారు. దీని వలన శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. తాడుతో వేలాడుతూ పని చేయాల్సి రావడం, గోడలపైకి ఎగబాకడంతో వెన్నెముక సమస్యలు వస్తుంటాయి. 45ఏళ్ల వయసు దాటిన తర్వాత వెన్నెముక నొప్పులతో బాధపడుతుంటారు. తమకు వచ్చే కూలీ పూట గడవడానికి సరిపోతే అదనంగా వచ్చి పడే ఆరోగ్య ఖర్చులు భరించే స్తోమత లేక జీవితాలు నెట్టకొస్తున్నారు.



ప్రమాదకరంగా పెయింటింగ్ పనులు చేస్తున్న కార్మికుడు

పెయింటర్ల రక్షణకు ఎలాంటి చట్టాలు లేవు

భవన నిర్మాణ కార్మికుల చట్టాలను మాత్రమే వీరికి వర్తింపజేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు, ఏదైనా ప్రమాదం జరిగి అంగవైకల్యమైతే వైకల్యం శాతం ఆధారంగా పరిహారం ఇస్తారు. భీమా కోసం భవన నిర్మాణ కార్మిక బోర్డులో పేరు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. దీనిపై సరైన అవగాహన లేకపోవడంతో గ్రామీణ ప్రాంత కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను పొందలేక పోతున్నారు.

ప్రమాదాలను నివారించాలి



మణికే బాబు, పెయింటర్, మార్టూరు

గత 20ఏళ్ల నుండి పెయింటర్‌గా పనిచేస్తున్నాను. పెయింట్ పని చేస్తున్నప్పుడు జరుగుతున్న ప్రమాదాలను నివారించాలి. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే విదంగా చట్టాలను రూపొందించాలి. నిత్యం ప్రమాదం అంచున నిలబడి పనిచేయాల్సి వస్తుంది. గత్యంతరం లేక ఉపాధి కోసం ప్రమాదమైనా పెయింట్ పనులకు వెళ్లాల్సి వస్తుంది.

కార్మిక చట్టాల అమలు చేయాలి



బొల్లాపల్లి బెంజిమన్, మార్టూరు

భవన నిర్మాణ కార్మిక చట్టాల అమలులో లోపాలున్నాయి. పెయింటర్లను కార్మిక శాఖ పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యాధులకు సంబంధించి కార్మికులకు సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలి.

పేదోడి వైద్యానికి భరోసా కామాక్షి హాస్పిటల్

హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు

ప్రజాశక్తి - చీరాల

పేదల వైద్యానికి కామాక్షి కేర్ హాస్పిటల్ బరోసా ఇస్తుందని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. మంగళవారం హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిభిరంలో ఆయన మాట్లాడారు. వేరికోస్ వేయిన్స్, హెర్నియా, కిడ్నీ స్టోన్, సెక్స్ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ గవిని లక్ష్మీ నారాయణ, డాక్టర్ కృష్ణరావు 72 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించామని తెలిపారు. అన్ని రకాల ఎముకల ఆపరేషన్లు, జనరల్, లాప్రో స్కోపి ఆపరేషన్లు, కిడ్నీలో రాళ్ల ఆపరేషన్లు, చెవి, ముక్కు, గొంతు ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. అత్యవస వైద్య సేవల సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. హాస్పిటల్ షుగర్ స్పెషలిస్ట్ జి నవీన్, డాక్టర్ తాడివలస కుమార్, జిఎం తాడివలస సురేష్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లక్ష్మి నారాయణ

విద్యార్థులకు వేసవి శిక్షణ, ఆటల పోటీలు

ప్రజాశక్తి - చీరాల

వేసవి కాలంలో విద్యార్థుల మేధాస్సు, నైపుణ్యాన్ని పెంచేందుకు, నైతిక విలువలు పెంచేందుకు నీతి కథలు, ఆటల పోటీలు నిర్వహిస్తూ ఆటలు ఆడిస్తున్న వేసవి శిక్షణ తరగతులు దోహద పడతాయాని గ్రంధపాలకురాలు ధనమ్మ అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాల యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. చిన్నారులకు జాతీయ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాల పఠనం, విద్యార్థులతో కథలు చదివిస్తున్నట్లు చెప్పారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు, జికె చదివిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాకల్టీ కె మోహన్ ఇంగ్లీష్ గ్రామర్ తరగతులు బోధిస్తున్నట్లు తెలిపారు. లెమన్ అండ్ స్పూన్ పోటీ నిర్వహించారు. ప్రతిరోజూ శిక్షణకు విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలిపారు.



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

టిడిపిదే విజయం : సాలెంరాజ్

ప్రజాశక్తి - వేమూరు



గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి సాలెం రాజు

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి విజయం సాధిస్తుందని గ్రేస్ ఫౌండేషన్ అధినేత, టిడిపి నాయకులు కైతేపల్లి సాలెం రాజ్ అన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అహంకార పూరిత ధోరణితో ప్రజలు విసుగు చెంది ఉన్నారని, రాష్ట్రంలో అధికార మార్పును ప్రజలు కోరుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుందనే దక్పథంతో టిడిపి, జనసేన కూటమికి పట్టం కట్టబోతున్నారని అన్నారు. రాజధాని లేని ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని ఏర్పాటు అదీకూడా అమరావతిలోనే జరుగుతుందనే ఆలోచనతో ప్రజలంతా వైసీపీని విస్మరించి టిడిపి, జనసేన వైపు మగ్గుచూపారని అన్నారు. ఎన్నికల రోజు నుండి ఇప్పటి వరకు రాష్ట్రంలో అనేక రకాల అలజడులు జరుగుతున్నాయని, దీనిపై ఎన్నికల అధికారి సిట్ ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. సిట్ బృందం విష్పక్ష పాతంగా వ్యవహరించి అన్ని విషయాల్లో క్రోడీకరించి ఎన్నికల కమిషన్‌కు పరిస్థితిని నివేదించాలని కోరారు. తద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, అలజడులు నిలువరించేందుకు దోహదపడాలని కోరారు. ఎన్నికల ఫలితాల రోజు కూడా ఎలాంటి అలజడులకు తావు లేకుండా ఎన్నికల సంఘం రాష్ట్రానికి ప్రత్యేక బందోబస్తు నిర్వహించి, పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి ఆనందబాబు

నేరస్తులకే అనుమతి అవసరం

ప్రజాశక్తి - వేమూరు

ఎన్నికలు పూర్తయిన నాటి నుండి రాష్ట్రంలో వైసిపి నాయకులు ఆరాచకాలు సృష్టిస్తున్నారని, ఓటమి భయంతోనే అరాచకాలతో పాటు ప్రజలకు కనిపించకుండా వైసిపి నాయకులు పారిపోయారని మాజీ మంత్రి నక్క ఆనందబాబు ఆరోపించారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితుల కారణంగా విదేశాలకు వెళితే జగన్మోహన్‌రెడ్డి తన సొంత అవినీతి పత్రిక, చానల్లో ఎలాంటి అనుమతి లేకుండా చంద్రబాబు విదేశాలకు వెళ్ళినట్లుగా వ్రాయించటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుపై ఎలాంటి అవినీతి అక్రమ చార్జిషీట్లు లేవని అన్నారు. విదేశాలకు వెళ్లడానికి కోర్టు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని గుర్తు చేశారు. తన తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ.వేలకోట్లు అక్రమంగా, అడ్డగోలుగా దోచుకున్న జగన్మోహన్‌రెడ్డికి కోర్టు అనుమతి కావాలని అన్నారు. ఆర్థిక నేరస్తుడిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి పాస్పోర్ట్ కూడా కోర్టు సీజ్ చేసిందని అన్నారు. ఎక్కడికి వెళ్లాలన్న కోర్టు అనుమతితోనే వెళ్లాల్సి ఉందని, కానీ లండన్ వెళ్ళటానికి అనుమతి తీసుకున్నా జగన్మోహన్‌రెడ్డి అమెస్టర్ డాంలో ఎందుకు దిగాల్సి వచ్చిందో తిరిగి వచ్చిన తర్వాత వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ చంద్రబాబు ఎక్కడికి వెళ్లినా ఎవరనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఉన్నందున వెళ్లే ప్రాంతాన్ని గోప్యంగా ఉంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్న విషయాన్ని వైసీపీ నాయకులు, జగన్మోహన్‌రెడ్డి దినపత్రికలు గుర్తు చేసుకోవాలని సూచించారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన యుద్దాయిలు మాత్రమే కోర్టు అనుమతులు తీసుకోవాలని గుర్తు చేశారు. ఒక అబద్ధాన్ని పదేపదే పత్రికలు, ఛానళ్లలో చూపించి ప్రజలను నమ్మించాలనే ప్రయత్నం చేయటం సరైనది కాదని అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం వీటన్నిటిపై తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

కలెక్టర్‌నయ్యా..

సమాజాభివృద్ధి కోసమే

- యుపిఎస్‌సి 504వ ర్యాంకర్ రాహుల్


కుటుంబ సభ్యులతో రాహుల్

ప్రజాశక్తి-పిసిపల్లి

తాను పేరు ప్రఖ్యాతల కోసం కాకుండా సమాజాభివృద్ధి కోసమే కలెక్టర్ అయినట్లు యుపిఎస్‌సి 504 ర్యాంకర్ రాహుల్ తెలిపారు. పిసిపల్లి మండలం ముద్దపాడు సచివాలయంలో పశువైద్య చిరుద్యోగిగా పని చేస్తున్న వంగేపురపు రత్నకుమార్ కుమారుడు రాహుల్‌కుమార్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల్లో 504వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా రాహుల్ ప్రజాశక్తితో తన అనుభవాలు, ఆశయాలను, సాధించిన విజయాల గురించి ఆయన వివరించారు. 1 నుంచి 3వ తరగతి వరకూ కనిగిరిలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో చదివినట్లు తెలిపారు. 4 నుంచి 10వ తరగతి వరకూ కనిగిరి ప్రగతి స్కూల్, ఇంటర్ నెల్లూరు నారాయణ కళాశాల, బిటెక్ జెఎన్‌టియు కాకినాడ, ఎంబిఎ ఉదయ్‌పూర్‌లో పూర్తి చేసినట్లు తెలిపారు. చిన్నప్పుడు నుంచి కలెక్టర్ కావాలని, సమాజానికి ఉపయోగపడే మంచి పేరు తెచ్చుకోవాలనే ఆసక్తి తనకు ఉందన్నారు. తల్లి వయోల రాణి ఉపాధ్యాయురాలు కావడంతో రోజు చదువుతోపాటు చిన్ననాటి ఆశయాలను గురించి తనకు గుర్తు చేసేవారన్నారు. సిఎటి పరీక్ష రాసి ఐఎంఎల్ 94శాతం మార్కులతో ఎంబిఎ చేయాలనుకున్నట్లు తెలిపారు. బిటెక్ పూర్తయిన వెంటనే రూ.6.5లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చినట్లు తెలిపారు. దాని పట్ల సంతృప్తి లేక ఉద్యోగంలో చేరలేదని తెలిపారు. 2015లో ఎంబిఎ పూర్తి చేసిన తరువాత రూ.17లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ తాను తృప్తి చెందలేదని తెలిపారు. విజయనగరంలో ఐఇఎస్ చదువుతున్న రవితేజ ఐఎఎస్ చేయాలని తనను ప్రోత్సహించినట్లు తెలిపారు. ఢిల్లీలో మంచి అవకాశాలు ఉన్నాయని రవితేజ చెప్పడంతో తాను ఢిల్లీకి వెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేయడానికి ఏకైక మార్గం ఐఎఎస్ అని భావించి ఆదిశగా తాను ముందడుగు వేసినట్లు తెలిపారు. కోచింగ్ తీసుకోకుండానే నాలుగు నెలల పాటు ఐఎఎస్‌కు తాను ప్రిపేరు అయినట్లు తెలిపారు. అనంతరం ఢిల్లీలోని వాజీరామ్ అండ్ రవి కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందినట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఐఎఎస్ సాధించేందుకు ఓ ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఆ ప్రణాళిక ప్రకారం ఇష్టపడి చదివినట్లు తెలిపారు. హార్డ్ వర్క్‌కు బదులుగా స్మార్ట్ వర్క్ చేసినట్లు తెలిపారు. 2018లో ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించినట్లు తెలిపారు. ఇంటర్వ్యూలో 701 ర్యాంకు సాధించి ఇండియన్ ఫారెన్ సర్వీస్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఐఎఎస్ కావాలనే పట్టుదలతో అందులో చేరలేదని తెలిపారు. 2019లో ప్రిలిమ్స్‌లో అర్హత కూడా సాధించలేక పోయినట్లు తెలిపాడు. అయినప్పటికీ మనోధైర్యంతో ముందుకు సాగినట్లు తెలిపారు. ఇటీవల ఎస్ఎస్‌సి, సిజిఎల్, సిడిఎస్, ఎన్‌డిఎ పరీక్షలకు ప్రిపేర్ అయినట్లు తెలిపారు. కరోనా సమయంలో పరీక్షలు రాయలేదన్నారు. 2023 మేలో ప్రిలిమ్స్, సెప్టెంబర్‌లో మెయిన్స్ రాసినట్లు తెలిపారు. ఆంథ్రోపాలజీ మెయిన్ సబ్జెక్టుగా పరీక్ష రాసినట్లు తెలిపారు. అందులో మార్కులు సాధించినట్లు తెలిపారు. 2024లో జనవరిలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 16న ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. అందులో తనకు జాతీయ స్థాయిలో 504 ర్యాంకు వచ్చినట్లు తెలిపారు. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులతోపాటు అమ్మమ్మ, నానమ్మ, తాతలు కూడా తనను కలెక్టర్‌గానే చూడాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఐఎఎస్ అధికారి అనుకుంటే విద్య, వైద్యంతోపాటు జిల్లాలో ఎక్కువ భాగాన్ని అభివృద్ధి వైపు నడిపించవచ్చునన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందజేసేందుకు వారిని అభివృద్ధి వైపు నడిపించేందుకు ఐఎఎస్‌ఐ అధికారి పాత్ర కీలకమని తెలిపాడు. తనకు 2021 డిసెంబర్ 10న ప్రియాంకతో వివాహమైనట్లు తెలిపారు. తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతిరోజూ ప్రియాంక ప్రోత్సహించినట్లు రాహుల్ తెలిపారు. ప్రియాంక బసవ తారకం కేన్సర్ ఇనిస్ట్యూట్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్‌పి


మాట్లాడుతున్న ఎస్‌పి గరుడ సుమిత్ సునీల్

ప్రజాశక్తి-దర్శి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎక్కడైనా గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి గరుడసుమిత్ సునీల్ తెలిపారు. స్థానిక పిజియన్ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో డిఎస్‌పి టి.అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత, రాజకీయ పార్టీల నాయకుల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా కావాలని గొడవలు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దర్శిలో ఎలాంటి ఘటనలను జరగకుండా ఉండేందుకు పోలీసులకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. పోలింగ్ సమయంలో దేవవరం, బొట్లపాలెం దర్శిలో కొన్ని ఘటనలు జరిగినట్లు తెలిపారు. పోలీసులు వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకుల వద్ద బాటిళ్లల్లో పెట్రోలు పోయరాదని తెలిపారు. దర్శి నియోజకవర్గం ఒక్కొక్కరూ రూ.లక్ష వంతున కట్టాలని 35 మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి టి.అశోక్‌వర్ధన్‌రెడ్డి సిఐలు షమీముల్లా, డి.మల్లికార్జున్, నాగరాజు, ఎస్ఐ సుమన్, పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికనూ వదల్లా..

- ట్రాక్టర్‌తో దున్ని పంట వేసిన వైనం

- ఆక్రమణదారులకు అధికార పార్టీ అండ

- పట్టించుకోని అధికారులు


ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాతశింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గిరిజనులు శ్మశాన వాటిక లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డినగర్, మల్లికార్జున నగర్, పోతుల చెంచయ్య కాలనీ, గుజ్జుల యలమందరెడ్డి నగర్ ప్రజల కోసం సర్వే నంబర్ 105లో సుమారు 4 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు శ్మశాన వాటిక కోసం కేటాయించారు. ప్రస్తుతం శ్మశాన వాటిక కోసం కేటాయించి స్థలం విలువ కోట్లలాది రూపాయలకు చేరింది. ఇటీవల కొందరు వైసిపి నాయకులు ఆ స్థలం తమదంటూ ముందుకొచ్చారు. పట్టించు కోవలసిన రెవెన్యూ అధికారులు చేతులెత్తేశారు. గత ఆరు నెలల క్రితం ట్రాక్టర్‌తో శ్మశాన వాటిక స్థలాన్ని దున్ని శవాలపైనే విత్తనాలు చల్లారు. దీంతో శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని అప్పటి నుంచి గిరిజనులు రెవెన్యూకార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటూ రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఈ స్థల విషయంలో గిరిజనులకు వైసిపి నాయకుడి మధ్య రచ్చ జరిగింది. దీంతో పోలీసులు సదరు నాయకుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆ కేసు సంగతి ఏమైందో తెలియదు కానీ. ఈ భూమి విషయంలో రెవెన్యూ అధికారులు సైతం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు. అప్పటి తహశీల్దారు ఉష తనను దూషించారని కేసు పెట్టింది. ఈ క్రమంలో ఆ భూమి తనదేనంటూ వైసిపి నాయకుడు కోర్టు మెట్లు ఎక్కాడు. రెవెన్యూ అధికారులకు, వైసిపి నాయకుడి మధ్య భూమి వివాదం జరుగుతున్న నేపథ్యంలో ట్రాక్టర్‌తో శ్మశాన వాటిక స్థలాన్ని దున్నేశారు. ఓ గిరిజనుడు చనిపోతే దున్నిన స్థలంలోనే మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. శ్మశాన వాటిక విషయంలో న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని గిరిజనులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు మాట్లాడిన మాటలతో గిరిజనులకు శ్మశాన వాటిక స్థలం దక్కుతుందా లేదా అని పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.


రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజీవ్ గాంధీకి నివాళి

ప్రజాశక్తి - ముద్దిపాడు

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మల సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వెల్లంపల్లిలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు సట్టి వసంత రాయుడు, కాంగ్రెస్ పార్టీ చీమకుర్తి మండల అధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్వర్లు, ఎస్‌సిసెల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులిపాటి రాఘవులు, సీనియర్ నాయకులు పోకూరి రామకృష్ణ, పులగాల అంజయ్య పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -దర్శి

మండల పరిధిలోని తూర్పు వెంకటాపురం గ్రామానికి చెందిన టిడిపి సానుభూతిపరుడు జంపాల గురుబాబు(28) అనే వ్యక్తి అనారోగ్యంతో ఈనెల 18న మృతిచెందాడు. అందులో భాగంగా టిడిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మృతుడు గురుబాబు కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రానికి అయ్యవారిరాజుపాలెం, నరసరాజుపాలెం, పెదకండ్ల గుంట గ్రామాలకు చెందిన రైతులు 965 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 918 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 47 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.318, అత్యల్ప ధర రూ.205, సరాసరిధర రూ.257.97 పైసలు పలికింది.

చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-కొండపి

వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు బి.కోటేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత కథలు చెప్పడం, కథల పుస్తకాలు చదివించడం, పాటలు పాడించడం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

నాగులుప్పలపాడు : గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని సామాజిక సేవాకార్యకర్త తెలగతోటి సామ్యూల్ తెలిపారు. ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామూల్ చిన్నారులకు నవ్వులతో కూడిన క్రీడలు నేర్పించారు. అనంతరం చిన్నారులకు క్విజ్ పోటీలు, పుస్తకపఠనం, కథలు చెప్పటం లాంటి ఆటలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు ప్రసాదు, మహిళా పోలీస్ అలేఖ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు తరువాత కూడా గొడవ పడితే..
రౌడీషీట్ తెరుస్తాం: డిఎస్‌పి

ప్రజాశక్తి-మార్కాపురం

ఓట్ల లెక్కింపు తరువాత కూడా గొడవ పడితే అలాంటి వ్యక్తులను గుర్తించి వారిపై రౌడీ షీట్ తెరుస్తామని మార్కాపురం డిఎస్‌పి ఎం బాల సుందరరావు హెచ్చరించారు. మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఓట్ల లెక్కింపు తరువాత కూడా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించకుండా రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు సహకరించాలని ఆయన కోరారు. మంగళవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘర్షణలకు తావులేకుండా ఉండేందుకు ప్రజలను చైతన్యవంతులను చేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పల్లెనిద్ర పేరుతో రోజూ ఏదో ఒక పల్లెలో పోలీస్ అధికారులు బస చేస్తారన్నారు. ఆ సమయంలో పోలీసులు ప్రజలతో మాట్లాడతారన్నారు. గొడవలకు పాల్పడితే ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరిస్తామన్నారు. ఎన్నికల గొడవలకు కారకులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని చెప్పారు. గొడవలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో ఒకరు గెలవడం.. మిగిలినవారు ఓడిపోవడం సహజమేనన్నారు. ఓటమిని జీర్ణించుకోలేని కొందరు గొడవలకు పాల్పడితే ఇబ్బందులు తప్పవన్నారు. ఎక్కడ ఏమి జరిగినా పోలీసులకు తక్షణమే సమాచారం అందించాలన్నారు. పోలీస్ శాఖ తక్షణం స్పందిస్తుందని అన్నారు. విజయోత్సవంలో డిజెలు, బాణాసంచా కాల్చడం వంటి చర్యలు సరికాదన్నారు. ఈ పాటికే బాణాసంచా అమ్మకందారులకు భారీ కొనుగోళ్లు జరగకుండా నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. పెట్రోల్ బంకుల్లోనూ వాహనం వస్తే తప్ప... లూజుగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేపట్టరాదన్నారు. లూజు అమ్మకాలు చేపట్టిన పెట్రోల్ బంకుల నిర్వాహకులపై చర్యలు ఉంటాయన్నారు. ఈ పాటికే పట్టణాల్లో, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో కార్డన్ సెర్చ్ చేపట్టామన్నారు. మారణాయుధాలు, బాంబులు వంటివి ఉంటే సీజ్ చేస్తామని, సంబంధిత వ్యక్తులను వదిలేది లేదని హెచ్చరించారు. అందరూ కలిసిమెలిసి జీవించాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి ఎం బాలసుందరరావు

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం


గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమం

విద్యార్థులు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ తెలిపారు. మంగళవారం యర్రగొండపాలెంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాల పట్ల శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, మ్యాగజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు జరిగే వేసవి శిక్షణ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి వివిధ అంశాల పట్ల శిక్షణ పొందాలన్నారు. పుస్తక పఠనం, కథలు చదివించడం, కథలు చెప్పించడం లాంటివి నిర్వహించారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-పెద్దారవీడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథపాలకుడు వై వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్ వేయించడం, క్యారమ్స్, డాన్స్ మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గ్రంథాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కథలు చదివించారు. క్విజ్ పోటీలు నిర్వహించారు. డ్యాన్స్ ప్రోగ్రాం బి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డితో పాటు 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.320

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం పేర్నమిట్ట గ్రామ రైతులు 1303 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 1155 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 148 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.320 రూపాయలు పలుకగా అత్యల్ప ధర రూ.205 పలికింది. సరాసరి కిలో ధర రూ.265.80 పలికింది. వేలంలో 23 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.

విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు: సిఐ

ప్రజాశక్తి-గిద్దలూరు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని గిద్దలూరు అర్బన్ సిఐ సోమయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ఫలితాల ముందు గాని, తరువాత గాని ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టించాలని చూస్తే వారిని ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా ఇప్పటికే అన్ని పార్టీల రాజకీయ నాయకులకు అవగాహన కల్పించామని ఆయన తెలిపారు. పల్లెల్లో కూడా పోలీసు సిబ్బంది పల్లె నిద్ర నిర్వహించి అక్కడ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్డెన్ అండ్ సెర్చ్ ద్వారా అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నారా, ఏమైనా మారణ ఆయుధాలు కలిగి ఉన్నారా వంటి అంశాలపై నిఘా పెంచమని తెలిపారు. అలాగే మండలంలో 11 రూట్లలో పోలీసుల గస్తీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో కూడా రెచ్చగొట్టే పోస్టులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాబట్టి మండలంలో ఎక్కడైనా గొడవలు కానీ, అల్లర్లు కానీ జరిగితే వెంటనే పోలీసులకు తెలపాలని అన్నారు. సమావేశంలో సిఐ సోమయ్యతో పాటు ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ సోమయ్య

సమ్మర్ క్యాంప్‌లో డ్రాయింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సమ్మర్ క్యాంపు రెండో రోజు మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ప్రతి సంవత్సరం పిల్లలకు సమ్మర్ క్యాంపును క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. రెండో రోజున విద్యార్థులకు డ్రాయింగ్ వేయడం నేర్పించారు. డ్రాయింగ్‌తో పాటు పేపర్‌తో ఫ్లవర్‌వాజ్‌లు తయారు చేయడం నేర్పించారు. బీటెక్ విద్యార్థి సుదర్శి మేఘన డ్రాయింగ్‌లో మెళకువలను నేర్పించారు. ఈ క్యాంపులో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సమ్మర్ క్యాంపును ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి పర్యవేక్షించారు.



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

కొల్లి నాగేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతు సంఘం జాతీయ నాయకులు, భారత కమ్యూనిస్టు పార్టీ ప్రముఖ నాయకులు కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు 4వ వర్థంతి సందర్భంగా మంగళవారం యర్రగొండపాలెంలోని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య మాట్లాడుతూ కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు విద్యార్థి దశ నుంచి సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో నడిచిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కెవి కృష్ణగౌడ్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఖాతాలు అప్‌డేట్ చేయాలి

సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మా నాయక్

ప్రజాశక్తి-మార్కాపురం


మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించిన పైకం తల్లుల ఖాతాల్లో జమ అవుతోందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్ తెలిపారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలపై స్థానిక వేమన బాలికల డిగ్రీ కళాశాలలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా దీవెన నగదును సంబంధిత కళాశాలలకు జమ చేయని వారి తల్లుల ఖాతాలకు సంబంధించి నవశకం లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసిన నోటీసును వారికి అందజేసి లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. గడిచిన త్రైమాసికంలో విడుదలైన నిధులను కళాశాలలకు చెల్లించని తల్లులకు ఫీజు కళాశాలకు చెల్లించే విధంగా విద్యార్థుల తల్లులకు కౌన్సెలింగ్ నిర్వహించి నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదు విడుదల పరిశీలన పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి కారణాలను నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి (నాలుగో త్రైమాసికం) కళాశాలలకు ఫీజు చెల్లించని తల్లులకు నోటీసులు అందజేయాలని, వారి వివరాలు సెక్రటేరియట్‌కు నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఎన్‌పిసిఐ పెండింగ్ ఉన్న ఎస్‌సి విద్యార్థుల ఆధార్ నెంబరును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాలన్నారు. పై అంశాలకు సంబంధించి త్వరితగతిన నిర్ణీత సమయంలో అప్‌డేట్ చేయని అధికారులపై శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశానికి మార్కాపురం ఎఎస్‌డబ్ల్యుఓ ఎన్ అరుణకుమారి అధ్యక్షత వహించగా ఇతర ప్రాంతాల ఎఎస్‌డబ్ల్యుఓలు ఎన్ అమ్మాజి, ఇ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్ర సిబ్బంది సమావేశం

ప్రజాశక్తి-పెద్దారవీడు


ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతున్న ఎఒ బుజ్జిబాయి

స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల రైతు భరోసా కేంద్ర సిబ్బందితో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యక్షత వహించిన మండల వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి మాట్లాడుతూ 2023-24 రబీ సీజన్‌లో మండలంలో తక్కువ వర్షపాతం నమోదు అయినందువల్ల పెద్దారవీడు మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చారని తెలిపారు. గ్రామాల్లోని వ్యవసాయశాఖ సిబ్బంది వారు రబీలో ఈ క్రాప్ చేసిన పంటలను 34 కాలమ్స్ ప్రొఫార్మాలో పొందుపరచి ఈ నెల 24వ తేదీలోగా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. మండలంలో సాగు చేసిన మినుము, అలసంద(బొబ్బర్లు), పెసర, ఆముదాలు, ఉలవలు, శనగలు వంటి పంటలకు 33 శాతం కంటే ఎక్కువగా రైతులు నష్టపోయారన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది అందరూ మీ గ్రామాల్లోని పంట ఈ క్రాప్ చేయించుకున్న అందరూ వివరాలు తప్పనిసరిగా ప్రొఫార్మాల్లో చేర్చి అందజేయాలన్నారు. ఆ తర్వాత సామాజిక తనిఖీ ఏర్పాటు చేసి అనంతరం ఈ నెల 29వ తేదీన జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి పంపించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు మండల వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి, మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై ఆర్‌బికె సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని ఇంకొల్లు ఆర్‌బికె1 నందు వ్యవసాయ సహాయకులకు మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షల అవగాహనపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. పర్చూరు ఎడిఎ ఎన్ మోహనరావు, ఎంఎఒ పి వేణుగోపాల్ భూసార పరీక్ష అంటే "భూమిలో ఏయే పోషకాలు ఉంటాయో, ఆ పోషకాలు ఎంత మోతాదులో మనం వేయబోయే పంటలకు అవసరమో తెలుసుకోవడాన్ని భూసార పరీక్ష అంటారని తెలిపారు. భూ సార పరీక్ష ఆవశ్యకత, దాని వల్ల కలిగే లాభాలు, మట్టి నమూనా సేకరణ వివిధ దశలు, మట్టి నమూనా సేకరణలో తప్పనిసరిగా తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రయోగ శాలలో పరీక్ష పంపే విధానం, సమగ్ర పోషక యాజమాన్య పథకం ద్వారా నేల సారవంతం బట్టి ఎరువులు, తగు యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులకు మేలు చేసే విధంగా వివిధ అంశాలను ఆర్‌బికె వద్ద సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించారు. మట్టిని పరీక్ష చేసుకుంటే, మన భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్, సేంద్రియ కర్బనం ఎంత మోతాదులో ఉన్నాయో తెలుస్తుందని తెలిపారు. మన భూములు ఆమ్ల భూములా, క్షార భూములా అని తెలుస్తుందని తెలిపారు. రైతులు మట్టి నమూనాలను గట్ల వెంబడి, ఎరువులు వేసిన చోట, నీళ్ళు ఉన్న చోట, చెట్టు నీడన మట్టి నమూనాలు సేకరించ కూడదని తెలిపారు. ఒక ఎకరంలో 5 నుండి 6 చోట్ల మట్టి నమూనాలు సేకరించాలని తెలిపారు. మట్టి నమూనాలను 'వి' ఆకారంలో 15 సెంటి మీటర్ల లోతులో గొయ్యి తీసి, అంచుల వెంబడి మట్టిని సేకరించి, చివరగా అర కిలో మట్టిని లాబ్‌కు పంపాలని తెలిపారు. మట్టితో పాటు రైతు వివరాలను స్లిప్‌లో రాసి లాబ్‌కు పంపాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎఒ వేణుగోపాల్, మండల ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.


భూసార పరీక్ష నమూనాలు వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

గొడవలకు పాల్పడితే కఠినచర్యలు

- ఓట్ల లెక్కింపుకు ప్రజలు సహకరించాలి
- చీరాలలో పోలీస్ 30యాక్టు, 144 సెక్షన్ అమలు
- ఘర్షణలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం

ప్రజాశక్తి - చీరాల

ఎస్పీ వకుల్ జిందాల్ శాంతి భద్రతలపైన ప్రత్యేక దృష్టి సారించారని, జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైనా ఘర్షణలకు పాల్పడిన, ప్రోత్సాహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎఎస్‌పి విఠలేశ్వరరావు హెచ్చరించారు. తీవ్రమైన నేరస్తులపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని అన్నారు. స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13న ఎన్నికల సందర్భంగా జరిగిన వివిధ పార్టీల ఘర్షణలో ఈపాటికే కొందరు వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేశామని అన్నారు. ఆయా కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేసి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కంపుకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న పోలీసు బలగాలతో పాటు అదనపు బలగాలు పట్టణంలో దిగనున్నాయని తెలిపారు. అల్లరి మూకలు ఎవ్వరు ఘర్షణల్లో పాల్గొనవద్దని సూచించారు. ప్రస్తుతం చీరాలలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని తెలిపారు. కేసుల్లోని ముద్దాయిలపై నిరంతర నిఘా ఉంటుందని అన్నారు. వారి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరుసగా నేరాల్లో పాల్గొన్న వారిపై రౌడీషీట్ తెరవబోతున్నట్లు తెలిపారు. వారి ప్రవర్తన మార్చుకోకపోతే చట్ట పరంగా జిల్లా బహిష్కరించడానికి వెనకాడబోమని తెలిపారు. ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని తెలిపారు. ఎవరు గుంపులుగా ఉండకూడదని అన్నారు. శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించినా ఉపేక్షించబోమని చెప్పారు. అల్లర్లలో పాల్గొనే వారి వాహనాలు సైతం సీజ్ చేస్తామన్నారు. అనంతరం నమోదైన కేసులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం కేసుల స్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యను వివరించారు. ఆయన వెంట ఒకటో పట్టణ సిఐ శేషగిరిరావు, 2వ పట్టణ సిఐ సోమశేఖర్, ఎస్ఐలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్‌పి విఠలేశ్వరరావు


మాట్లాడుతున్న ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు

23న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల భవన్నారాయణ స్వామి 1431వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23న నిర్వహించనున్నట్లు బ్రహ్మోత్సవాల నిర్వాహకులు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో తెలిపారు. అయ్యప్ప స్వామి సేవా సంఘం, మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బాబు నాగేంద్ర, కె సుబ్బారావు, వక్కలగడ్డ శ్రీనివాసరావు, దేశిరాజు వెంకటరమణ బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని జగనన్న కాలనీలో ఈనెల 14న రౌడీ షీటర్ ఎర్రగడ్డ సుబ్బారావు హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ నజీర్ బేగ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. గుడ్డికాయ లంకకు చెందిన రౌడీ షీటర్ ఎర్రగడ్డ వెంకట సుబ్బారావును రేపల్లె జగనన్న కాలనీకి చెందిన విశ్వనాథపల్లి రామ్ ప్రసాద్, బేతపూడికి చెందిన బడుగు ఆదర్శ్ పాత గొడవల నేపథ్యంలో జగనన్న కాలనీలోని ఖాళీ స్థలంలో కత్తులతో నరికి హత్య చేశారని చెప్పారు. ముద్దాయిలను జగనన్న కాలనీలో మంగళవారం అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిలను అరెస్ట్ చేసిన రేపల్లె డిఎస్పి టి మురళీకృష్ణ, సిఐ నజీర్ బేగ్, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

గరుడాచలం సత్రం లీజు రద్దు చేయాలి

మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణ నడిబొడ్డున ఉన్న పేరం గరుడాచలం నాయుడు దానం చేసిన తూర్పు సత్రం స్థలాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు ఇచ్చిన లీజు చట్టరీత్యా నేరమని, తక్షణమే లీజు రద్దు చేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. తూర్పు సత్రం లీజుకు ఇవ్వటం కాపు వర్గీలతో పాటు బాపట్ల ప్రజల మనోభావాలు దెబ్బతీయటమేనని పేర్కొన్నారు. లీజు రద్దు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేసి తూర్పు సత్రం స్థలాన్ని కాపాడుకుంటామని అన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ సత్యనారాయణ ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని లీజు రద్దు చేస్తామని హామీ ఇచ్చారని అన్నం సతీష్ తెలిపారు. ప్రజల అభీష్టం మేరకే లీజును రద్దు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అన్నం సతీష్

ల్యాండ్ టైటిల్ యాక్టుపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ హక్కుల చట్టం వలన ప్రజల స్థిరాస్తి హక్కులను న్యాయ వ్యవస్థ పరిధి నుంచి రాజకీయ నాయకులు తమ కబంధ హస్తాల్లోకి తీసుకునే అవకాశం ఉందని, ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎబిటియుసి నాయకులు బి సామ్యేల్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా చట్టం దొంగచాటుగా అమలులోకి తెచ్చారని అన్నారు. ఈ చట్టం అమలైతే సామాన్యులకు అన్యాయం జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు హేమ సుందరరావు, అంబటి పుష్పరాజు, వాసు, డాక్టర్ మాచర్ల మోహనరావు, రిటైర్డ్ తహశీల్దారు కోటేశ్వరరావు, ఊటుకూరు వెంకటేశ్వర్లు, కట్టా రాజ్ వినయ్ కుమార్, మేడ వెంకటరావు, సిఐటియు నాయకులు ఎం వసంతరావు, గాదె హరిహరరావు, గజవల్లి శ్రీనివాసరావు, గూడూరు శివరామ ప్రసాద్, సూర్యప్రకాశరావు, ఎల్లమందారెడ్డి, మునిరుల్లా ఖాన్, జయరామిరెడ్డి, రామేశ్వర కుమార్, మణిబాబు, శర్మ, మల్లీ, రామ్ మనోహర్ లోహియా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సామ్యూల్


రోగులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

రోగులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయిని యనమండ్ర వరలక్ష్మి సౌజన్యంతో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి కాలంలో పేద రోగులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేసిన దాత వరలక్ష్మిని మెడికల్ ఆఫీసర్ అభినందించారు. రోటరీ ప్రతినిధులు ఆమెను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శరత్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవిప్రసాద్, షేక్ మొహమ్మద్ రఫీ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, రోటరీ సీనియర్ సభ్యులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, మలాది శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎపిఇఎపి సెట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఎపిఇఎపి సెట్ పరీక్షలకు 484 మంది విద్యార్థుల హాజరు

ప్రజాశక్తి - వేటపాలెం

ఎపిఇఎపి సెట్ పరీక్షకు మంగళవారం 484 మంది విద్యార్థులు హాజరైనట్లు సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఏపి ఉన్నత విద్యా శాఖ మండలి ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్‌టియు పర్యవేక్షణలో కళాశాల్లోని టిసిఎస్ ఐయాన్ సెంటర్ నందు ఈనెల 16నుండి 23వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 250మందికి 239మంది, సాయంత్రం 250మందికి 245మంది మొత్తం 500మందికి 484మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థులకు వారికి తోడుగా వచ్చిన సహాయకులకు కళాశాల యాజమాన్యం తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి - అద్దంకి

ఇటీవల వెలుగులోకి వచ్చిన కృష్ణ జిల్లా కంకిపాడుకు చెందిన బధిర యువతిపై అత్యాచార సంఘటనకు పాల్పడిన యువకులకు తగిన శిక్ష పడేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని చైతన్య మహిళా మండలి అధ్యక్షురాలు పూనూరి ఆరోగ్యం డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో ఇంటివద్ద వున్న బధిర, మానసిక దివ్యంగుల విద్యార్థినులను ఒంటరిగా తమ ఇండ్ల వద్ద వదిలిపెట్టకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. దివ్యాంగులను ఇబ్బంది పెట్టినవారిపై దివ్యాంగుల హక్కుల చట్టం ద్వారా కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు.

28న అద్దంకి నాంచారమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి - పర్చూరు

దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ళ ఈ నెల 28న జరుగుతాయని ఆలయ వంశపారంపర్య అర్చకులు మంగళవారం తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా పెద్ద ఎత్తున సినిమాలు, మహోత్సవం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం ఉంటాయని తెలిపారు.

24 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు


డిఇఒ కె.నారాయణరావు

ప్రజాశక్తి-బాపట్ల

ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణ రావు మంగళవారం తెలిపారు. సైన్స్ (ఫిజిక్స్, బయోలాజికల్) పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8.45 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్స్ ఇప్పటికే అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు . విద్యార్థులు తమ పేరు, జిల్లా, పాఠశాల, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి నేరుగా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. మే 24న ఫస్ట్ లాంగ్వేజ్, మే 25న సెకండ్ లాంగ్వేజ్, మే 27న ఇంగ్లీష్, మే 28న మాథమెటిక్స్, మే 29న ఫిజికల్ సైన్స్, మే 30న బయోలాజికల్ సైన్స్, మే 31న సోషల్ స్టడీస్, జూన్ 1న ఓఎస్‌ఎస్సీ పేపర్ -1, జూన్ 3న ఓఎస్‌ఎస్సీ పేపర్ -2 పరీక్షలు జరుగుతాయని ఆయన వివరించారు.

25 నుంచి సమ్మర్ క్యాంప్

- జూన్ 1 వరకు క్యాంప్ నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన నిర్వాహకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంపు ఈ నెల 25 నుంచి జూన్ 1 వరకు నిర్వహిస్తున్నట్లు నగరంలోని ఎల్‌బిజి భవన్‌లో నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో సమ్మర్ క్యాంప్ పోస్టర్‌ను నిర్వాహకులు సిహెచ్.వినోద్., జ్యోతి, పి.నరసింహారావు, బాబు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ మ్యాజిక్, క్రాఫ్టింగ్, కథా- రచన, కార్టూన్ గీయటం, పపెట్‌షో, సెల్ డిఫెన్స్, కోలాటం, ఫన్ని మ్యాథ్స్ వంటి పలు రకాల విజ్ఞానదాయక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు 9490300412 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చెత్త తీసేది వారానికి ఒకసారే..

- మాతాశిశు వైద్యశాలలో పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, గర్భిణులు
- ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు


మాతాశిశు వైద్యశాల వద్ద పేరుకుపోతున్న వ్యర్థాలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పిల్లలు, గర్భిణులు ఉన్న ఇంట్లో ఎవరైనా చెత్తను రోజుల తరబడి ఉంచుకుంటారా.? ఆరోగ్యం పట్ల కనీస అవగాహన ఉన్న వాళ్లెవరూ ఆ పనిచేయరు. కానీ పేద గర్భిణులు, పేద పిల్లలు వైద్యం పొందే ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో మాత్రం రోజుల తరబడి చెత్త పేరుకుపోతున్నా నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారులు పట్టించుకోలేదు. వారానికి ఒకసారి మాత్రమే హాస్పిటల్‌లో పేరుకుపోతున్న చెత్తను తరలిస్తున్నారు. అది కూడా హాస్పిటల్ సిబ్బంది పదేపదే విన్నవిస్తేనే.! పారిశుధ్య అధికారుల నిర్లక్ష్యం కారణంగా హాస్పిటల్‌లోని గర్భిణీలు, చిన్నారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా కేంద్రమైన ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో ప్రతిరోజూ గర్భిణీలు, చిన్నారులు ఇన్‌పేషెంట్లుగానూ, ఔట్‌పేషెంట్లుగానూ వైద్యసేవలు పొందుతుంటారు. ఆస్పత్రిలో నిత్యం వ్యర్థాలు పోగుపడుతుంటాయి. ఈ వ్యర్థాలను ఆసుపత్రి సిబ్బంది సర్జికల్ కవర్లలో చుట్టి ఆసుపత్రి ప్రాంగణంలోని ఓ ప్రదేశంలో వేస్తున్నారు. ఆ వ్యర్థాలను అక్కడ నుంచి తరలించడంలో కార్పొరేషన్ పారిశుధ్య విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రి నుంచి ప్రతిరోజూ చెత్తను తరలించాల్సి ఉండగా.. ఆ పనిచేయడం లేదు. హాస్పిటల్ సిబ్బంది పదేపదే విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోవడం లేదు. వారానికోసారి మాత్రమే తరలిస్తున్నారు. పందికొక్కులు, పాములు సంచరిస్తుండటంతో హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ హాస్పిటల్ చుట్టూ ఉన్న చిల్లచెట్లు తొలగించి.. శుభ్రం చేయించినా.. చెత్త సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వ వైద్యశాలలో పేద గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ఏ మాత్రం శ్రద్ధ లేకుండా కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోజు విడిచి రోజు తరలిస్తాం..

ఎన్.పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

మాతా శిశు వైద్యశాలలో పోగు పడిన చెత్తను తరలించే విషయంలో ఎదురవుతున్న సమస్య మా దృష్టిలో ఉంది. వారానికి రెండుసార్లు అక్కడి నుంచి చెత్తను తరలిస్తున్నాం. ఇప్పుడు ఏమైనా లోపాలు ఉంటే సవరిస్తాం. రోజు విడిచి రోజు అక్కడ నుంచి చెత్తను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. మా సిబ్బందికి ఈ విషయంపై స్పష్టమైన ఆదేశాలిస్తాం.

అందని బేబీ కిట్లు

సరఫరా నిలిపేసిన ప్రభుత్వం



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

'గత నెలలో యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నాకు ప్రసవం జరిగింది. పుట్టిన మగబిడ్డకు బేబీ కిట్టు ఇస్తారని ఆశించా. కానీ ఇవ్వలేదు. షాపులో రూ.1,500 వెచ్చించి కొనుగోలు చేయక తప్పలేదు. మూడేళ్ల కిందట మా వదినకు ఆ ఆసుపత్రిలోనే ప్రసవం జరిగితే ప్రభుత్వమే ఉచితంగా బిడ్డ సంరక్షణకు కిట్‌ను అందించింది. ఇప్పుడెందుకు ఇవ్వరని వైద్య సిబ్బందిని అడిగితే ప్రభుత్వమే కిట్ల సరఫరాను నిలిపివేసిందని చెప్పారు..' అని పుల్లలచెరువు మండలానికి చెందిన ఓ బాలింత ఆవేదన వ్యక్తం చేశారు. మాతా శిశు మరణాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఊదరగొడుతున్న ప్రకటనలు నీటి మీద రాతల్లా మారుతున్నాయి. నవజాత శిశువును శుభ్రమైన వస్త్రాల్లో ఉంచి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేని పక్షంలో వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. గతంలో పాత పద్ధతులు అవలంబించడం, శుభ్రమైన వస్త్రాలు వాడకపోవడంతో శిశు మరణాలు సంభవించేవని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గత టిడిపి ప్రభుత్వం బేబీ కిట్‌లను అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని నెలలు పంపిణీ చేసి తర్వాత నిలిపివేసింది.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నెలకు 130 ప్రసవాలు, త్రిపురాంతకం ప్రభుత్వ వైద్యశాలలో 30, పుల్లలచెరువు ప్రభుత్వ వైద్యశాలలో 15, వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యశాలలో 5, దూపాడు ప్రభుత్వ వైద్యశాలలో 2.. ఇలా సుమారు నెలకు 180 నుంచి 200 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి.

కిట్‌లో అందించే వస్తువులు..

శిశువు తల్లితో పాటు సుఖంగా నిద్రపోయేందుకు బెడ్, దోమతెర, తల్లుల చేతులు శుభ్రం చేసుకునే ద్రావణం, బేబీ సబ్బు, పౌడర్, న్యాప్‌కిన్ కిట్‌లో ఉండేవి. వీటితో పిల్లలకు ఆరోగ్య భద్రత ఉండేది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేళ్లుగా ఈ పథకం పూర్తిగా నిలిచిపోయింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పురుడు పోసుకునే వారిలో 95 శాతం మంది నిరుపేదలే. వారంతా బిడ్డ సంరక్షణ కోసం అప్పులు చేసి బేబీ కిట్లు కొనుగోలు చేసుకుంటున్నారు.

సరఫరా చేస్తే అందిస్తాం..

డాక్టర్ దేవర యదిద్యా, ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, యర్రగొండపాలెం

బేబీ కిట్లు బాలింతలకు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే ప్రభుత్వం కోవిడ్ తర్వాత సరఫరా నిలిపివేసింది. పేదలు, గిరిజనులు ఎవరైనా వస్తే మేమే సొంతంగా తెప్పించి అందిస్తున్నాం. మళ్లీ సరఫరా చేస్తే బాలింతలకు అందజేస్తాం.

ఓట్ల లెక్కింపు కేంద్రాలలో

'మార్గదర్శకాల' మేరకే ఏర్పాట్లు చేయాలి..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఆరు నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ కలిసి మంగళవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పటిష్టమైన భద్రత కొనసాగించాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ఆరు నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూములను ఆయన పరిశీలించిన తదుపరి దస్త్రాలను తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఆరు నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు వచ్చేందుకు మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్యారికేడ్లు సిద్ధం చేసుకోవాలని, అనుమతులు లేకుండా ఎవరిని కళాశాల ప్రాంగణం వైపు రానివ్వరాదన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా సమగ్ర ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు చేపట్టాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రత్యేక టేబుల్స్, ఏవీఎం యంత్రాలలో ఓట్ల లెక్కింపు కొరకు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ప్రతి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించేలా వెబ్ క్యాస్టింగ్ కంట్రోల్ రూమ్ నడిపించాలన్నారు. కంట్రోల్ రూమ్ వద్దనే మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి కొంత దూరంలో వాహనాల పార్కింగ్ స్థలం ఎంపిక చేయాలని ఎస్పీకి సూచించారు. మూడంచెల భద్రతపై ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో జి.రవీందర్, అధికారులు, తదితరులు ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

జనన, మరణాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ డి.సురేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో నమోదయ్యే జనన, మరణాల వివరాలు వెబ్‌సైట్ నమోదు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుం సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.కృష్ణబాబు ఆదేశించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. విజయవాడలో జరిగిన అన్ని జిల్లాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, గణాంకాధికారులకు జనన మరణ రిజిస్ట్రేషన్‌పై మంగళవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, రాష్ట్ర సంచాలకులు హాజరయ్యారు. శిక్షణా కార్యక్రబ వివరాలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ ఆసుపత్రిలో జరిగిన జననాలకు సంబంధించి.. తల్లి, బిడ్డ డిశ్చార్జి అయ్యే లోపు జనన ధ్రువీకరణ పత్రం అందజేయాలని ఆదేశించారన్నారు. ఈ పోర్టల్, చట్ట సవరణపై సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా ప్రచారం నిర్వహించాలని సూచించారన్నారు. ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు ఇంటింటికీ వెళ్లి జనన ధృవీకరణ పత్రం ఆవశ్యకత పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారన్నారు. ప్రతి ఉద్యోగి అంకితభావంతో పని చేయాలని వైద్య,ఆ రోగ్య శాఖ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు సూచించారన్నారు. నిర్ణీత సమయం లోపు జనన, మరణ ధృవీకరణ పత్రాలను అర్హులకు అందించాలని తెలియజేశారన్నారు. కింది స్థాయి సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ జనన, మరణ ధృవీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలన్నారు. పట్టణ గ్రామీణ ప్రజలు వారి కుటుంబంలో సంభవించిన జనన, మరణాలను సకాలంలో సంబంధిత అధికారులకు తెలియపరచి, ధృవీకరణ పత్రాలను పొందవలెనని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు తెలియజేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్ కుమార్ వివరించారు.